సాక్షి
ప్రకాశం

గురువారం । 4 । జనవరి । 2024



ఎన్నికల్లోగా వెలిగొండ పూర్తి

సార్వత్రిక ఎన్నికల్లోగా వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి కృష్ణా జలాలను పశ్చిమ ప్రాంత ప్రజలకు అందించేందుకు సీఎం చర్యలు చేపట్టారని మంత్రి ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. - 8లో..



అతి వేగానికి తండ్రీకొడుకు బలి

ఎదురుగా వస్తున్న బైకును మితిమీరిన వేగంతో వెళ్తున్న కారు ఢీకొట్టడంతో తండ్రీకుమారులు అక్కడికక్కడే మృతి చెందారు - 8లో..

గరిష్టం/కనిష్టం
30/22

వాతావరణం

పొగమంచు అధికంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి.

పదిలమైన ప్రణాళికతో..

'పది'లమైన ఫలితాల కోసం జిల్లా విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా అధికారులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి పక్కాగా అమలు చేస్తున్నారు. మార్చి 18వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఫలితాలు సాధించేలా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోనే జిల్లాను మొదటి స్థానంలో నిలిపేలా అధికారులు కృషి చేస్తున్నారు.

జిల్లాలోని మండలాలు	38	జిల్లాలోని హైస్కూళ్లు	578
పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులు			29461



స్టడీ అవర్స్‌లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు

- స్టేట్‌లో మొదటి ర్యాంక్ సాధనే లక్ష్యంగా
- విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి
- వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక ప్రణాళిక
- స్టడీ మెటీరియల్ పంపిణీ
- మార్చి 18 నుంచి పదో తరగతి పరీక్షలు

మార్కాపురం: పదో తగరతి పరీక్షలు వస్తున్నాయంటే విద్యార్థుల్లో ఒకటే టెన్షన్..అయితే వారు ఎలాంటి భయాందోళనకు గురి కాకుండా ముందు నుంచే ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేశారు జిల్లా విద్యాశాఖ అధికారులు. కలెక్టర్ దినేష్‌కుమార్ ఎప్పటికప్పుడు విద్యాశాఖ అధికారులతో సమీక్షలు నిర్వహించి ఉత్తమ ఫలితాలు సాధించేలా దిశా నిర్దేశం చేస్తున్నారు. 2022 సంవత్సరం విడుదలైన ఫలితాల్లో ఉమ్మడి ప్రకాశం రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. జిల్లాల విభజన తర్వాత 2023 సంవత్సరంలో ప్రకటించిన ఫలితాల్లో జిల్లా స్థానం 12కు పడిపోయింది. దీంతో తిరిగి పాత ఫలితాలను పునావృతం చేసే దిశగా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. కార్పొరేట్ పాఠశాలలకు భిన్నంగా తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాలల్లోనే రాత్రిళ్లు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. డీఈఓ ఆధ్వర్యంలో సబ్జెక్టు నిపుణులచే తయారు చేయించిన స్టడీ మెటిరీయల్ త్వరలో విద్యార్థులకు అందించనున్నారు. ఉదయం 8 గంటల నుంచి 9.30 వరకు, సాయంత్రం 4.15 నుంచి 6గంటల వరకు పాఠశాలలోనే విద్యార్థులకు ప్రత్యేకంగా స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సులభ పద్ధతుల్లో అర్థమయ్యే రీతిలో బోధించి అప్పటికప్పుడు వారి సామర్థ్యం గుర్తించేలా పరీక్షలు పెడుతున్నారు. రోజుకో సబ్జెక్టులో వారి ప్రతిభను గుర్తించేలా చర్యలు తీసుకుంటున్నారు. డైలీ టెస్టులు, గ్రాండ్ టెస్టులు, వీక్లి టెస్టులు నిర్వహిస్తున్నారు. ఇలా చేయటం వల్ల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

విద్యార్థుల దత్తత..

10వ తరగతి పరీక్షల షెడ్యూల్ రావడంతో ప్రత్యేక ప్రణాళికతో పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. మార్చి 18వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభమై, 30న జరిగే ఒకేషనల్ పరీక్షలతో పరీక్షలు ముగుస్తాయి. 18న తెలుగు, 19న హిందీ, 20న ఇంగ్లిష్, 22న లెక్కలు, 23న ఫిజికల్ సైన్సు, 26న బయోలాజికల్ సైన్సు, 27న సోషల్, 28న సంస్కృతం, 30న ఒకేషనల్ పరీక్షలను నిర్వహిస్తారు. మార్కాపురం డివిజన్‌లో 13 మండలాలు, ఒంగోలులో 12 మండలాలు, కనిగిరిలో 13 మండలాలు ఉన్నాయి. మొత్తం 29,461 మంది విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ఉపాధ్యాయులు ముందుగా చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తిస్తున్నారు. వారిని దత్తత తీసుకుని ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రత్యేక తరగతులు న్విహించడమే కాకుండా మోటివేషన్ క్లాసులు తీసుకుంటున్నారు.

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు



మాకు ఇప్పటి నుంచే స్పెషల్ క్లాసులు పెడుతున్నారు. గణితం, ఇంగ్లిష్, సైన్స్ సబ్జెక్టులలో మంచి మార్కులు సాధించే దిశగా సిద్ధం చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం పూట స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు.

– ఫయాజ్, 10వ తరగతి విద్యార్థి, మార్కాపురం

స్టడీ అవర్స్‌తో ఉపయోగం



ప్రతి రోజు ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహించటం చాలా ఉపయోగంగా ఉంది. తరగతుల్లో కాస్త వెనుకబడిన విద్యార్థులకు స్టడీ అవర్స్‌లో ప్రత్యేకంగా చెబుతున్నారు. మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులలో స్కోరింగ్‌పై అవగాహన కల్పిస్తున్నారు.

– రంగశివనాయుడు, మార్కాపురం

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



పదో తరగతి పరీక్షలకు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాం. జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేయనున్నాం. ఈ ఏడాది 100శాతం ఉత్తీర్ణతపై దృష్టిసారించాం. డైలీ టెస్టులు, గ్రాండ్ టెస్టులు, వీక్లి టెస్టులు నిర్వహిస్తున్నాం. మోటీవేషన్ క్లాసులు కూడా నిర్వహించి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తాం.

– సుబ్బారావు, డీఈఓ, ఒంగోలు

వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



చదువులో వెనుకబడిన విద్యార్థులకు పాఠశాలలో ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. సమగ్రమైన అధ్యయనం, విశ్లేషణ, క్షేత్ర పర్యటన ద్వారానే మార్కులు పొందగలరు. ఉపాధ్యాయులు కూడా రాష్ట్రస్థాయిలో మార్కాపురం పేరు నిలబెట్టేందుకు తమ వంతు కృషి చేస్తున్నారు. తగిన విధంగా ప్రణాళిక వేసుకుని తరగతులు నిర్వహిస్తున్నాం. ఈ దఫా రాష్ట్రస్థాయి ర్యాంక్ వస్తుందని ఆశిస్తున్నాం.

– ఎం.చంద్రశేఖరరెడ్డి, హెచ్‌ఎం, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల

ఇంగ్లిష్, గణితంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఇంగ్లిష్, మ్యాథ్స్ సబ్జెక్టులపై కచ్చితంగా ప్రత్యేక దృష్టి సారించాలి. లేదంటే పరీక్ష రోజున ఇబ్బందులు పడతారు. ఒకటి, రెండు మార్కుల ప్రశ్నలపై పూర్తి అవగాహన పెంచుకోవాలి. మోడల్ పేపర్ దగ్గర పెట్టుకుని ప్రతి రోజు ప్రాక్టీస్ చేయాలి.

– ప్రభాకరరెడ్డి, ఇంగ్లిష్ టీచర్, మార్కాపురం జెడ్పీ హైస్కూల్

న్యూస్‌రీల్

లీజుకు బౌద్ధస్థూపం రెస్టారెంట్

ఒంగోలు టౌన్: కురిచేడు మండలం చందవరం గ్రామంలోని ప్రసిద్ధి చెందిన బౌద్ధ స్థూపం వద్ద ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్మించిన రెస్టారెంట్‌ను లీజుకు ఇవ్వనున్నట్లు పర్యాటక శాఖ జిల్లా అధికారి కె.బెన్‌హర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు పూర్తి వివరాలకు ఏపీటీడీసీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్: 9640007182, జిల్లా పర్యాటక అధికారి 9121144102 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రైజ్ కళాశాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



రైజ్ కళాశాలను పరిశీలిస్తున్న, కలెక్టర్ దినేష్ కుమార్, ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు సెంట్రల్: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అవసరమైన స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై వల్లూరులోని రైజ్ కళాశాలను కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికాగర్గ్ బుధవారం పరిశీలించారు. 2019 ఎన్నికల్లో కూడా ఈ కళాశాలలోనే స్ట్రాంగ్‌రూమ్స్, కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్‌తో మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల నుంచి ఈ కళాశాలకు దూరం, ఈవీఎంల తరలింపునకు ఉన్న మార్గం, ప్రాంగణంలోకి ప్రవేశం, భద్రత తదితర అంశాలను పరిగణలోనికి తీసుకుకోవాల్సిన ఉందని చెప్పారు. త్వరలోనే తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఆర్ శ్రీలత, ఏఎస్పీ నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి, ఒంగోలు, టంగుటూరు తహసీల్దార్లు మురళి, సంజీవరావు, జిల్లా ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలి

- జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

పామూరు: ప్రత్యేక స్పందలో వివిధ సమస్యల పరిష్కారానికి వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయానికి బుధవారం వచ్చిన ఆయన రికార్డులు పరిశీలించారు. మండలంలో నిర్వహించిన ప్రత్యేక స్పందనకు 600 పైగా అర్జీలు రాగా వాటిలో 200 ఆన్‌లైన్ కోసం, 300 అర్జీలు భూమిలేని నిరుపేదలు సాగుభూములు ఇవ్వాలని కోరుతూ దరఖాస్తు చేశారన్నారు. జిల్లాలో అసైన్‌మెంట్ కమిటీల ద్వారా భూమి పొంది 20 ఏళ్ల పూర్తయిన వారికి 4165 ఎకరాలకు 3500 మంది రైతులకు పట్టాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. గతంలో మండలంలో జీరో ఖాతాలో పడి సుమారు 6 వేల మంది రైతులు వారి భూములు ఆన్‌లైన్‌కు నోచుకోక పోవడంతో ప్రభుత్వ పథకాలకు నోచుకోక నష్టపోయారని ప్రస్తుతం వాటిని జీరో ఖాతా నుంచి తొలగించి ఆన్‌లైన్ చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ప్రస్తుతం జీరో ఖాతాలో ఉన్న వారికి త్వరితగతిన నోటీసులు ఇచ్చి 15 రోజుల్లోగా పారదర్శకంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారి భూములు ఆన్‌లైన్ చేయాలని తహసీల్దార్‌కు సూచించారు. తహసీల్దార్ ఆవుల సురేష్, వీఆర్‌ఓలు ఉన్నారు.

విశ్వసనీయతకు మారుపేరు జగనన్న

- మాయ మాటలతో పచ్చనేతలు వస్తున్నారు జాగ్రత్త
- చంద్రబాబు ఇచ్చిన మాటలకు గ్యారెంటీలేదు
- బడుగు, బలహీన వర్గాలను ఓటు బ్యాంకుగా వాడుకున్నారు
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్



మాట్లాడుతున్న రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: ఎన్నికలు సమీపిస్తుండటంతో మాయ మాటలతో వంచించడానికి పచ్చనేతలు వస్తున్నారని, వారితో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం ఆడిటోరియంలో బుధవారం జరిగిన వైఎస్సార్ పెన్షన్ కానుక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2014–19లో చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాటలకు షూరిటీ లేకుండా పోయిందని, రైతులకు రుణమాఫీ చేస్తానని, డ్వాక్రా రుణాలు రద్దు చేస్తానని, బాబు వస్తే జాబు వస్తుందని అనేక మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. బడుగు, బలహీన వర్గాలను చంద్రబాబు ఓటు బ్యాంకుగా వాడుకున్నారని, వారికి కనీసం మౌలిక వసతులు కూడా కల్పించలేకపోయారన్నారు. పింఛన్ కోసం జన్మభూమి కమిటీల ఇళ్ల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందని, పచ్చ కండువా వేసుకుంటేనే పింఛన్ మంజూరు చేసేవారన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలు ఆధార్‌లో వయసు మార్చి పింఛన్లు మంజూరు చేశారన్నారు.

జగనన్నది నమ్మకం, విశ్వసనీయత

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది నమ్మకం, విశ్వసనీయత, మాట నిలబెట్టుకునే మనస్తత్వం ఉన్న వ్యక్తన్నారు. ఆయన ఎన్నికల ముందు సుదూర పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవటానికి అధికారంలోకి వచ్చిన వెంటనే నవరత్నాల పథకాన్ని అమలు చేశారని, 99 శాతం వాగ్దానాలను నెరవేర్చారని కొనియాడారు. నిస్సహాయ స్థితిలో ఉన్న వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు వైఎస్సార్ పింఛన్ కానుక అమలు చేసి ఏడాదికి రూ.250 చొప్పున పెంచి ఇచ్చిన మాట మాట ప్రకారం రూ.3 వేలు అందజేస్తున్నామన్నారు. ఇంకా ఎవరికైనా అర్హులకు పింఛన్ అందకుంటే మీ ఇంటి వద్దకు వచ్చే వలంటీర్లకు చెప్పాలని, అర్హతే ప్రామాణికంగా ఇంటికే పెన్షన్లు అందుతున్నాయని పేర్కొన్నారు. అనంతరం వైఎస్సార్ పెన్షన్‌ను కానుకను మంత్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, పార్టీ మండల అధ్యక్షులు కె.ఓబులరెడ్డి, బీవీ సుబ్బారెడ్డి, జి.రమణారెడ్డి, ఎస్.పోలిరెడ్డి, జిల్లా వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి ఐ.వి.సుబ్బారావు, ఏఎంసీ వైస్ చైర్మన్ కె.జయరావు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాష, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, బీసీ సంఘం జిల్లా నాయకుడు ఆర్.పిచ్చయ్య, సర్పంచ్ ఆర్.అరుణాబాయి, ఏఎంసీ డైరెక్టర్ కందుల సత్యనారాయణ, డీఎల్‌డీఓ బీవీఎస్ సాయికుమార్, ఎంపీడీఓ వైవీ నాగేశ్వరప్రసాద్, ఈఓపీఆర్డీ ఈదుల రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పెన్షన్ అందిస్తున్న, కలెక్టర్ దినేష్‌కుమార్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నగర మేయర్ గంగాడ సుజాత

పింఛన్ల పెంపుతో సామాజిక భద్రత

- కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్
- ప్రకాశం భవన్‌లో పెంచిన పింఛన్లు పంపిణీ చేసిన కలెక్టర్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, మేయర్

ఒంగోలు సెంట్రల్: వైఎస్సార్ పెన్షన్ కానుక పెంపుతో లబ్ధిదారులకు మరింత సామాజిక భద్రత ఒనగూరుతుందని కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. పెరిగిన వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీలో భాగంగా ప్రకాశం భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ దినేష్‌కుమార్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నగర మేయర్ గంగాడ సుజాత పాల్గొన్నారు. తొలుత కాకినాడలో రంగరాయ మెడికల్ కాలేజీ గ్రౌండ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో వారు చెక్కును పెన్షన్‌దారులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ 8 రకాల పెన్షన్ లబ్ధిదారులకు ఈ నెల ఒకటి నుంచి పెంచిన నగదుతో రూ.3 వేలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం 2019లో రూ.2,250తో ప్రారంభించి విడతల వారీగా నాలుగేళ్లలో రూ.3 వేలకు పెంచిందని పేర్కొన్నారు. జిల్లాలో 8 రకాల పెన్షన్‌దారులు 2,47,638 మందికి పెంచిన నగదుతో రూ.74.29 కోట్లు జమ చేశామని వివరించారు. ఈ నెలలలో నూతనంగా 3,731 మందికి పెన్షన్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్‌ను రూ.3 వేలకు పెంచారన్నారు. మరొకరిపై ఆధారపడకుండా జీవించేందుకు పెన్షన్ కానుక ఎంతో ఉపయోగపడుతుందన్నారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ పేదల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశప్రవేశపెట్టిందని తెలిపారు. రాష్ట్రం ఎన్ని ఇబ్బందుల్లో ఉన్నా ఒకటో తేదీనే పెంచిన పెన్షన్ ఇవ్వడం గొప్ప విషయమని, ఇది ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డిఏ పీడీ వసుంధర, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ లింగంగుంట రవిబాబు, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మహబూబ్, సచివాలయ నోడల్ అధికారి ఉషారాణి తదితరుల పాల్గొన్నారు.

జగనన్న కాలనీల నిర్మాణం అద్భుతం

- గృహ నిర్మాణ శాఖ ఎండీ శివప్రసాద్



మాట్లాడుతున్న గృహనిర్మాణ శాఖ ఎండీ శివప్రసాద్, పీడీ పేరయ్య

మార్కాపురం: జగనన్న కాలనీల నిర్మాణాలు అద్భుతంగా జరుగుతున్నాయని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. శివప్రసాద్ అన్నారు. మార్కాపురం పట్టణ ప్రజల కోసం పట్టణశివార్లలో నిర్మిస్తున్న ఇడుపూరు 1,3 జగనన్న లే అవుట్లను బుధవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ మార్కాపురంలో 6 వేల గృహాలు మంజూరు చేశామని, వీటి నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బుధ, గురువారాల్లో జగనన్న కాలనీల్లో నిర్మాణాలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టామని చెప్పారు. లబ్ధిదారులే స్వయంగా నిర్మించుకోవడం, లేబర్ ఏజెన్సీల ద్వారా కట్టించే పద్ధతుల్లో నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. వివిధ దశల్లో లబ్ధిదారులకు బిల్లులు వెంటనే అందుతున్నాయని తెలిపారు. లబ్ధిదారులు ఇళ్ల వద్ద నిలబడి ఐరిష్ ఫొటో తీసుకొని అప్లోడ్ చేసిన వెంటనే బిల్లులు ఇస్తున్నామన్నారు. ఒక్కో ఇంటికి సుమారు రూ.5 నుంచి రూ.6 లక్షల వరకు లబ్ధిదారునికి ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఇందులో ఇంటి స్థలం రూ.2 నుంచి రూ.3 లక్షలు, ఇంటి నిర్మాణానికి రూ.2.70 లక్షల వరకు అందుతోందన్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.1.50 లక్షలు, మిగిలిన మొత్తం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలు అందంగా చక్కగా కడుతున్నారని లబ్ధిదారులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు.

ప్రభుత్వం ఉచితంగా ఇసుక ఇవ్వడంతో పాటు మార్కెట్ ధరకంటే తక్కువగా సిమెంట్, ఇనుము తదితర వస్తువులను అందిస్తోందన్నారు. లబ్ధిదారులు త్వరగా నిర్మాణాలు చేసుకుంటే బిల్లులు వస్తాయన్నారు. కట్టుకున్న ఇళ్ల వద్ద లబ్ధిదారులు ఫొటోలు తీయించుకుని అప్లోడ్ చేయించుకోవాలన్నారు. నిర్మాణ పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈయన వెంట పీడీ పేరయ్య, ఈఈ దాశరధి శర్మ, డీఈ పవన్‌కుమార్, కమిషనర్ రవీంద్ర, తహశీల్దార్ మంజునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెప్మా కార్యాలయంలో..

లబ్ధిదారులు తమకు మంజూరైన ఇళ్లను త్వరగా నిర్మించుకునేలా ఆర్పీలు కృషి చేయాలని కమిషనర్ రవీంద్ర సూచించారు. బుధవారం సాయంత్రం మెప్మా కార్యాలయంలో టీఎల్‌సీ అధ్యక్షురాలు, కౌన్సిలర్ దొడ్డ భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్పీలు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పురోగతి తెలుసుకుని ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తయ్యేలా చూడాలని, అవసరమైన ఆర్థిక సహాయాన్ని బ్యాంకు ద్వారా అందించేందుకు సహకరించాలని సూచించారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి

- కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు సెంట్రల్: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం ఆయన ప్రకాశం భవనంలో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీ ప్రతినిధులు కూడా గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలను తనకు అందించాలని చెప్పారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పుల్లో జాగ్రత్త వహించాలన్నారు. ఓటర్ల క్లైయిమ్స్ త్వరితగతిన పరిష్కరించాలన్నారు. థర్డ్ జెండర్స్ కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. గిరిజన సమూహాలకు సంబంధించి పీఓఐటీడీ శ్రీశైలం వారి నుంచి వివరాలు తెప్పించి ఆ ప్రాంతాల్లో కూడా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఓటర్లుగా నమోదు చేయాలని కోరారు. జీరో డోర్ నంబర్లు లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఈఆర్‌ఓలు, సెక్టార్ ఆఫీసర్లు కలిసి పరిశీలించాలన్నారు. ఈ నెల 10న కలెక్టర్లతో కేంద్ర ఎన్నికల కమిషనర్లు విజయవాడల్లో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నందున జిల్లాలో ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన పూర్తి వివరాలను సమగ్రంగా రూపొందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ శ్రీలత, మార్కాపురం కలెక్టర్ రాహుల్ మీనా, వైఎస్సార్‌సీపీ నుంచి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల నుంచి స్వరూప్, రసూల్, గుర్రం సత్యనారాయణ, రఘురామ్, ఎన్నికల విభాగ సూపరిండెంట్ శ్రీనివాసరావు, ఈఆర్‌ఓలు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

నేడు లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు

ఒంగోలు సెంట్రల్: ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా గురువారం లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు కలెక్టర్ కార్యాలయంలోని స్పందన హాలులో నిర్వహించనున్నట్లు దివ్యాంగులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకురాలు జి.అర్చన ఒక ప్రకటనలో తెలిపారు.

శాంతియుతంగా ఎన్నికల నిర్వహణ

- ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: రానున్న సాధారణ ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలను తీసుకుంటున్నామని ఎస్పీ మలికాగర్గ్ చెప్పారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఎన్నికల్లో నమోదై ట్రయిల్‌లో ఉన్న కేసుల స్థితిగతులు, జిల్లాలో గుర్తించిన అతి సమస్యాత్మక, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు తదితర విషయాలను చర్చించారు. లైసెన్స్ తుపాకులు, నాన్‌బెయిలబుల్ వారెంట్ కేసులతో పాటుగా గ్రామాలకు సంబంధించిన సమాచారం, చెక్‌పోస్టులు, ఎన్ఫోర్స్‌మెంట్ తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ... ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సమాచార వ్యవస్థను బలోపేతం చేసి సమస్యలను సృష్టించే వ్యక్తులను గుర్తించాలన్నారు. పోలీస్‌స్టేషన్ల పరిధిలో తుపాకుల లైసెన్స్‌లను పరిశీలించాలని, మద్యం, గంజాయి, నాటుసారా అక్రమ రవాణాను నియంత్రించాలని, తరుచూ కార్డన్ సెర్చ్ నిర్వహించాలని, చెక్ పోస్టులను ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఎస్పీ (క్రైం) ఎస్వీ శ్రీధర్‌రావు, డీఎస్‌బీ డీఎస్పీ బి.మెరియదాసు, డీఎస్పీలు వి.నారాయణస్వామిరెడ్డి, అశోక్‌వర్ధన్, రామరాజు, వీర రాఘవరెడ్డి, సీహెచ్ శ్రీనివాసరావు, ట్రైనీ డీఎస్పీ షేక్ షహబాజ్, ఐసీసీఆర్ సీఐ దుర్గాప్రసాద్, డీసీఆర్‌బీ సీఐ బీమా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ మలికాగర్గ్

క్లుప్తంగా

20న నవోదయ ప్రవేశ పరీక్ష

తర్లుపాడు: మండలంలోని కలుజువ్వలపాడులో పీఎం జవహర్ నవోదయ విద్యాలయ-2లో 6వ తరగతి ప్రవేశానికి ఈనెల 20వ తేదీ ఉదయం 11 గంటలకు పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రసన్నకుమార్ తెలిపారు. 27 మండలాలకు చెందిన విద్యార్థులకు మొత్తం 28 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. హాల్ టికెట్లు సంబంధిత మండల విద్యాశాఖాధికారి కార్యాలయాల ద్వారా ప్రధానోపాధ్యాయులకు అందిస్తామని తెలిపారు. నవోదయ.జీవోవీ.ఇన్/సీబీఎస్ఈ ఐటమ్స్.ఎన్ఐసీ వెబ్‌సైట్ నుంచి కూడా హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు. రిజిస్ట్రేషన్ సమయంలో అభ్యర్థి రిజిస్ట్రేషన్ నంబర్‌ను యూజర్ ఐడీగా, పుట్టినతేదీని పాస్‌వర్డుగా ఉపయోగించుకోవాలని స్పష్టం చేశారు.

ఉచితంగా ఏసీ మెకానిక్ శిక్షణ

ఒంగోలు టౌన్: జిల్లాలోని నిరుద్యోగ యువకులకు స్వయం ఉపాధిలో భాగంగా ఏసీ, రిఫ్రిజిరేటర్ మెకానిక్‌లుగా ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు గ్రామీణాభివృద్ధి, స్వయం ఉపాధి శిక్షణా సంస్థ (రూడ్‌సెట్) డైరక్టర్ ప్రతాప్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి 30 రోజుల పాటు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. 19 నుంచి 45 ఏళ్లలోపు వయసు వారు భాగ్యనగర్‌లోని రూడ్‌సెట్ కార్యాలయంలో పేరు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9573363141ను సంప్రదించాలని సూచించారు.

చలి.. పులి



కొత్తపట్నం రోడ్డు ఫ్లయ్ ఓవర్ వద్ద ప్రభాత భానుడు

ప్రజానీకాన్ని చలి.. పులి వణికిస్తోంది. ఉదయం 9 గంటల సమయం దాటుతున్నా పల్లెలు, పట్టణాలు మంచు దుప్పటి కౌగిలిలో బంధీగానే ఉంటున్నాయి. దట్టంగా కురుస్తున్న పొగమంచులో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు.లైట్ల వెలుగులో మెల్లగా గమ్యస్థానాల వైపు కదులుతున్నారు. గజ గజా వణికిస్తున్న చలిలోనూ ముచ్చటైన మంచు దృశ్యాలను సెల్‌ఫోన్లలో బంధించేందుకు నగరవాసులు ఆసక్తి చూపుతున్నారు.

\- సాక్షి, ఒంగోలు



చలి కాచుకుంటున్న సెక్యూరిటీ సిబ్బంది



లైట్ల వెలుగులోనే ప్రయాణం





జాతీయ రహదారిపై దట్టంగా కమ్ముకున్న పొగమంచులో వాహనదారుల అవస్థలు

10న పాత వాహనాల

ఈ-వేలం



ఒంగోలు టౌన్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయానికి సంబంధించి కాలపరిమితి తీరిన 10 వాహనాలను ఈ నెల 10వ తేదీన వేలం వేయనున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ రాజ్యలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కొనుగోలు పోర్టల్ ద్వారా ఈ-వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు రిజిస్టర్ చేసుకుని ఈ-వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

జిల్లా జైలులో వాహనాల వేలం

గుంటూరు రేంజ్ డీఐజీ ఆదేశాల మేరకు జిల్లా జైలులో కాలంతీరిన వాహనాలను ఈ నెల 10వ తేదీన వేలం వేయనున్నట్లు జైలు సూపరెండెంట్ పి.వరుణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు జిల్లా జైలు కార్యాలయంలో రూ.2500 డిపాజిట్ చెల్లించాలని పేర్కొన్నారు. వేలంలో వాహనాలు కొనుగోలు చేయనివారి డిపాజిట్ సొమ్మును వెనక్కి ఇస్తామని స్పష్టం చేశారు. వాహనాలను కొనుగోలు చేసిన వ్యక్తులు వేలం పూర్తయిన వెంటనే 18 శాతం జీఎస్టీతో పూర్తి సొమ్మును చెల్లించాలని తెలిపారు. అదే రోజు వాహనాలను తీసుకెళ్లాల్సి ఉంటుందన్నారు.

నేడు మంత్రి సురేష్ ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ

సింగరాయకొండ/జరుగుమల్లి: సింగరాయకొండ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వైఎస్సార్ పింఛను కానుక పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు ఎంపీడీఓ షేక్ జమీవుల్లా తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జరుగుమల్లిలో పింఛను పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి ఆదిమూలపు సురేష్ హాజరవుతున్నట్లు ఎంపీపీ బెల్లం నిర్మల తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.2750 నుంచి రూ.3 వేలకు పెంచిన పింఛను కానుక పంపిణీని మంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలో పాత పింఛన్లు 6509 ఉండగా, కొత్తగా 86 మందికి వైఎస్సార్ పింఛను కానుక మంజూరైందని ఎంపీపీ వివరించారు.

అంగన్వాడీ కార్యకర్తలు మరియు సహాయకులకు రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి...

1. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు 11 డిమాండ్లతో 12.12.2023 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారు. మంత్రుల బృందం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మరియు ముఖ్య కార్యదర్శి మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, ఆర్థిక శాఖ వివిధ స్థాయిలలో ప్రభుత్వం అనేక దఫాలుగా చర్చలు చేసిన తరువాత, ప్రభుత్వం కొన్ని డిమాండ్లను అంగీకరించింది, తదనుగుణంగా ప్రభుత్వం G.O లను జారీ చేసింది మరియు అందరికీ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. పెండింగ్‌లో ఉన్న అద్దెలు, కూరగాయల పోపు దినుసులు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ ఖర్చులు మరియు నిర్వహణ ఛార్జీలు విడుదల చెయ్యడం జరిగింది.

a) అంగన్ వాడీ హెల్పర్‌ను అంగన్ వాడీ వర్కర్‌గా పదోన్నతి కల్పించేందుకు వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ 20.12.2023 తేదీన జి.ఓ.ఎం.ఎస్.నెం.44 జారీ చేయబడింది.

b) అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలకు ఒకసారి TA/DA మరియు అంగన్‌వాడీ హెల్పర్‌లకు త్రైమాసిక TA/DA క్లైయిమ్ చేయడానికి మెమో నం.2303564/ 2023/ PROG-I-A1, dt.20.12.2023 జారీ చేయబడింది. ఈ ఆదేశాలు జారీ చేసిన తేదీ నుంచి అమలులోకి వస్తాయి.

c) అంగన్‌వాడీ వర్కర్లు & హెల్పర్‌ల కొనసాగింపుకు గరిష్ట వయోపరిమితిని 62 సంవత్సరాలుగా నిర్ణయించి, సేవా ముగింపు ప్రయోజనం రూ.1,00,000/- మరియు రూ.40,000 అందించడానికి జి.ఓ.ఎం.ఎస్.నెం. 47, తేదీ 20.12.2023 జారీ చేయబడింది.

d) అద్దెలు (Rs.66.54 Crs), పరిపాలనా ఖర్చులు (నీరు & విద్యుత్ ఛార్జీలు, దీపులు, ఫినాయిల్ మొదలైనవి) (Rs.7.81 Crs) మరియు AWCల నిర్వహణ (చిన్న మరమ్మతులు) (రూ. 6.36 Crs) కోసం బడ్జెట్‌లు విడుదల చేయబడ్డాయి.

2. అంతేకాకుండా 2019 నుండి

a) అంగన్ వాడీ వర్కర్ల జీతాలను రూ.11,500/- లకు, మినీ అంగన్ వాడీ జీతాలను రూ.7,000/- కు, అంగన్ వాడీ హెల్పర్ల జీతాలను రూ.7,000/- కు పెంచింది.

b) 2013 నుంచి అంగన్‌వాడీల కార్యకర్తలకు, సూపర్వైజర్లుగా ప్రమోషన్లు ఇవ్వలేదు. రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా రాష్ట్రంలో ప్రమోషన్లు ఇచ్చి 560 గ్రేడ్- 2 సూపర్‌వైజర్ పోస్టులను, జిల్లాలో 12 ఖాళీలను భర్తీ చేయడం జరిగింది. ప్రకాశం జిల్లాలో435 అంగన్వాడి కార్యకర్తలు, 1692 అంగన్వాడి ఆయా, 49 మినీఅంగన్వాడి కార్యకర్తల ఖాళీలను భర్తీ చేయడం జరిగింది.

c) ఇదే సందర్భంలో ఈ సూపర్వైజర్ పోస్టులకు పరీక్షలు రాసేవారి వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ వారికి అనుకూల నిర్ణయం తీసుకుంది. దీంతో 9 ఏళ్లుగా ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్న వారిలో ఎక్కువ మంది పోటీపడే అవకాశాన్ని కల్పించడం జరిగింది.

d) అన్నిటికంటే ముఖ్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలకు అంగన్ వాడీ కార్యకర్తలు, సహాయకులను అర్హులుగా గుర్తించి వారికి డీబీటీ ద్వారా రూ.1,313 కోట్లు అందించడం జరిగింది. నవరత్నాలు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేసిన జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ రైతు భరోసా, జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ తదితర పథకాలను వారికి వర్తింప చేస్తోంది.

e) ఈ ఏడాది నుంచి అంగన్‌వాడీ వర్కర్లకు, హెల్పర్లకు జీవిత బీమాను కూడా వర్తింప చేస్తోంది. ప్రమాద బీమాగా రూ. 2 లక్షల వరకూ చెల్లించడం జరుగుతోంది.

f) గర్భవతులకు, బాలింతలకు, పిల్లలకు గతంలో మాదిరిగా వండి ఇచ్చే ఇబ్బంది లేకుండా టేక్ హోమ్ రేషన్ పద్ధతిని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. దీనివల్ల వారికి పనిభారం తగ్గడమే కాకుండా పారదర్శకంగా, నాణ్యమైన సేవలు అందించే మార్గాలను అంగన్వాడీలకు అందిస్తూ 2023 నుంచి ప్రభుత్వం డ్రై రేషన్ అందిస్తోంది.

3. జాతీయ ఆహార భద్రతా చట్టం (NFSA), 2013 నిర్దేశించిన విధంగా ప్రతి గర్భిణీ స్త్రీలకు మరియు పాలిచ్చే తల్లికి బిడ్డ పుట్టిన 6 నెలల వరకు మరియు 7 నెలల నుండి 6 సంవత్సరాల వయస్సు గల ప్రతి బిడ్డకు (పౌష్టికాహార లోపంతో బాధపడే వారితో సహా) సప్లిమెంటరీ న్యూట్రిషన్ అందించడం తప్పనిసరి. వారు సంబంధిత అంగన్ వాడీ సెంటర్లో నమోదు చేసుకున్న లబ్ధిదారులకు అనుబంధ పోషకాహారం అన్ని పని వేళల్లో అందించాలి. ICDS పథకం కింద సప్లిమెంటరీ న్యూట్రిషన్, క్యాలెండర్ సంవత్సరంలో కనీసం 300 లేదా నెలలో సగటున 25 రోజులు అనగా, ఉదయం స్నాక్స్, వేడిగా వండిన భోజనం (HCM) మరియు టేక్ హోమ్ రేషన్‌గా అందించాలి.

4. సప్లిమెంటరీ న్యూట్రిషన్ ప్రోగ్రాం యొక్క లక్ష్యాలు ప్రకాశం జిల్లాలో 22,939 గర్భిణీ స్త్రీలు మరియు పాలిచ్చే తల్లులు, 63,920 మంది 7 నెలల నుండి 3 సంవత్సరాల పిల్లలకు మరియు 41,793 మంది 3 సంవత్సరాల నుండి 6 సంవత్సరాల పిల్లలకు నిరంతరం పోషకాహార సహాయాన్ని అందజేయడం. AWWలు & AWHలు సమ్మె వలన వారి విధులకు హాజరు కాకపోవడం వలన, పోషకాహార కిట్‌లు, THR మరియు గుడ్లు & పాలు మరియు పంపిణీ చేయబడిన సప్లిమెంటరీ న్యూట్రిషన్ (SNP) లబ్ధిదారులకు లేదు. అంతేకాకుండా, గర్భిణీలు & పాలిచ్చే తల్లులు & 06 నెలలు - 6 సంవత్సరాల పిల్లలను ఆరోగ్య శాఖ ANM సమన్వయంతో అంగన్‌వాడీ కేంద్రంలో వివిధ పెరుగుదల/ ఆరోగ్య పరిమితులపై పర్యవేక్షణ జరగటం లేదు.

5. పైన పేర్కొన్న అంశాలదృష్ట్యా, అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే సేవలకు ఆటంకం ఏర్పడినందున, గర్భిణులు & పాలిచ్చే స్త్రీలు, చిన్న పిల్లలు మరియు అణగారిన వర్గాల యొక్క ప్రయోజనాల దృష్ట్యా అంగన్ వాడీ కేంద్రాలలో అందించే సేవలను కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరియు ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయడం జరిగింది.

6. పిల్లలకు మరియు గర్భవతులు మరియు బాలింతలకు ఎలాంటి అంతరాయం లేకుండా పోషకాహారాన్ని అందించటానికి, అంగన్‌వాడీ సెంటర్లను నిర్వహించటానికి, ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయడానికి, జివిడబ్ల్యువి & వివిఎస్‌డబ్ల్యుఎస్ (లేదా) సెర్ప్ (లేదా) రెండింటి కలయికతో కూడిన గ్రామ సంస్థల యంత్రాంగాన్ని ఉపయోగించుకుంటున్నాము.

7. కాబినెట్ మంత్రుల గ్రూపు, చీఫ్ సెక్రటరీ, ముఖ్య కార్యదర్శి స్థాయి అధికారులు మీతో పలుదఫాలుగా చర్చించి, సమ్మెను విరమించుకోవలసినదిగా విజ్ఞప్తి చేసియున్నారు. డిపార్టుమెంటు కూడా అందరు అంగన్ వాడీ కార్యకర్తలకు బల్క్ ఎస్.ఎం.ఎస్‌ను పంపించి సమ్మెను విరమించుకోవలసినదిగా కోరటం జరిగింది. ప్రస్తుతం ప్రకాశం జిల్లాలో 16.74% గర్భవతులు రక్తహీనతతో వున్నారు, 2.01%, 5 సంవత్సరాలలోపు పిల్లలు బరువు తక్కువగా వున్నారు. 3.34% 5 సంవత్సరాలలోపు పిల్లలు ఎత్తుకు తగిన బరువు లేకుండా (ఎన్.ఎఫ్.హెచ్.ఎస్-5 ప్రకారంగా) వున్నారు. అంగన్ వాడీ కేంద్రాల ద్వారా పోషకాహార పంపిణీలో జరుగుతున్న అంతరాయం వలన వీరి ఆరోగ్య మరియు పోషణ స్థాయిలు దిగజారి హైరిస్క్ గ్రూప్లో పడే ప్రమాదం వున్నది. మీరు సమ్మె నోటీసు ఇచ్చి ఉన్నారు. దీనిని పురస్కరించుకొని ప్రభుత్వం వారు మీ సంఘము యొక్క సభ్యులతో పలుసార్లు చర్చించి ముఖ్యమైన కోరికలకు ప్రాథమికముగా ఆమోదం తెలిపియున్నారు. ప్రభుత్వం మిగిలిన కోరికలను పరిష్కరించుటకు ప్రయత్నములు చేయుచున్నప్పటికీ, మీరు మీ యొక్క ఉద్యోగ బాధ్యతలను విస్మరించి విధులకు రావటం లేదు. కావున జిల్లా పరిపాలన అధికారిగా మీకు విజ్ఞప్తి చేయడం ఏమనగా మీ న్యాయమైన కోర్కెలన్నీ ప్రభుత్వం పరిష్కరించడానికి కృతనిశ్చయంతో ఉంది. ఇప్పటికే ప్రభుత్వం చాలా డిమాండ్లను పరిష్కరించిందని గుర్తుంచుకోవలసినదిగా అభ్యర్థిస్తున్నాము. అలాగే ఈ సమ్మె వల్ల బాలింతలు, గర్భిణీ స్త్రీలు, పసిపిల్లలు పౌష్టికాహారం అందక ఇబ్బందులను పడుతున్న విషయాన్ని సహృదయంతో అర్థం చేసుకోవాలని మనవి చేస్తున్నాం. గర్భవతులు మరియు పిల్లల ఆరోగ్య మరియు పోషణ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమ్మెను విరమించాలని విజ్ఞప్తి చేస్తున్నాము మరియు జనవరి 5, 2024 లోగా విధులకు హాజరు కావలసినదిగా కోరుచున్నాము. ఒకవేళ సమ్మె విరమింపచెయ్యని యెడల ప్రభుత్వ నియమ నిబంధనలు అనుసరించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలియచేయటమైనది.

ఇట్లు
కలెక్టర్ మరియు జిల్లా మెజిస్ట్రేట్, ప్రకాశం.

ఎన్నికల్లోగా వెలిగొండ ప్రాజెక్టు పూర్తి

- పారిశ్రామిక వాడగా వైపాలెం నియోజకవర్గం
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్
- పలు అభివృద్ధి పనుల ప్రారంభం, శంకుస్థాపన, రుణాల పంపిణీ



సొసైటీ బ్యాంకు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి సురేష్

యర్రగొండపాలెం: వైపాలెం నియోజకవర్గాన్ని పారిశ్రామిక వాడగా తీర్చిదిద్దుతానని, ఈ మేరకు పెద్దారవీడు మండలంలోని కుంటకు సమీపంలో 100 ఎకరాల స్థలాన్ని సేకరించి మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక పుల్లలచెరువు రోడ్డులోని టీటీడీ కల్యాణ మండపం వద్ద ప్రభుత్వం కేటాయించిన స్థలంలో కో ఆపరేటివ్ సొసైటీ బ్యాంకు భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశ్రామిక వాడలో రూ.4 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు పెట్టుబడితో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకొస్తున్నారని పేర్కొన్నారు. దీనివల్ల నియోజవర్గంలోని యువతకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తిగా వెనకబడిన పశ్చిమ ప్రాంతాభివృద్ధికి బాటలు వేశారని, మార్కాపురంలో మెడికల్ కళాశాల మంజూరు చేసి వేగంగా నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. పెద్దదోర్నాలలో రూ.50 కోట్లతో గిరిజన సూపర్ స్పెషాలిటీ వైద్యశాల, యర్రగొండపాలెంలో 100 పడకల వైద్యశాల పనులు పూర్తి కావచ్చాయన్నారు. త్రిపురాంతకం, పెద్దదోర్నాలలో రైతుల అవసరార్థం కో ఆపరేటివ్ బ్యాంకులను మంజూరు చేయించామన్నారు. అభివృద్ధికి బాటలు వేస్తూ, అన్ని వర్గాల ప్రజలకు ఏదో ఒక విధంగా లబ్ధి చేకూర్చేందుకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నవరత్నాలు పథకాలను దిగ్విజయంగా అమలు చేసిన జగనన్న తిరిగి అధికారంలోకి వచ్చిన వెంటనే మహా నవరత్నాలు పథకాలను అమలు చేస్తారని చెప్పారు.

ఎన్నికల్లోగా వెలిగొండ ప్రాజెక్టు పూర్తి

రానున్న సార్వత్రిక ఎన్నికల్లోగా వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేసి కృష్ణా జలాలను పశ్చిమ ప్రాంత ప్రజలకు అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారని మంత్రి పేర్కొన్నారు. అనంతరం డ్వాక్రా మహిళా గ్రూపులకు కో ఆపరేటివ్ బ్యాంకు మంజూరు చేసిన రుణం రూ.కోటి, కర్షక మిత్ర పథకం కింద రూ.10 లక్షల రుణాన్ని మంత్రి పంపిణీ చేశారు. ముందుగా స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో రూ.32 లక్షలతో నిర్మించిన స్త్రీ శక్తి భవనాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉన్నతి పథకం కింద రూ 9.15 లక్షలతో మంజూరైన 3 ఆటోలను మహిళలకు పంపిణీ చేశారు. ఒక్కోటి రూ.56 వేలతో మంజూరైన 3 యూనిట్ల కుట్టుమిషన్లను మహిళలకు అందజేశారు. సాయిబాబా గుడి వీధిలో రూ.25 లక్షలతో మంజూరైన సైడ్ డ్రైనేజీకి శంకుస్థాపన, విశ్వనాథం వీధిలో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, రవీంద్ర వైద్యశాల వీధిలో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు కింద రూ.72 లక్షలతో నిర్మించిన రెండు తరగతి గదులను మంత్రి ప్రారంభించారు. అనంతరం మార్కెట్ యార్డులో రూ.1.60 కోట్లతో మంజూరైన వెయ్యి టన్నుల సామర్థ్యం గల గోడౌన్, రెండు ప్లాట్‌ఫారాల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ వై.ఎం.ప్రసాదరెడ్డి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ బాలగురువయ్య, సీఈవో ఈదుల కోటిరెడ్డి, ఏజీఎం బాలకుమారి, బ్యాంకు మేనేజర్ ఎస్.కోటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు మేడగం వెంకటరెడ్డి, డీఆర్‌డీఏ ఏరియా కోఆర్డినేటర్ కె.లక్ష్మీరెడ్డి, డీఎల్‌డీవో బీవీఎస్.సాయికుమార్, ఎంపీడీఓ వైవీ నాగేశ్వర ప్రసాద్, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మూర్తిరెడ్డి, ఎంపీపీ కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ విజయభాస్కర్, ఏఎంసీ చైర్మన్ సింగారెడ్డి నాగమణిపోలిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఓబులరెడ్డి, సుబ్బారెడ్డి, పోలిరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు షాబీర్‌బాషా, సచివాలయాల మండల కన్వీనర్ జబీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

అతి వేగానికి తండ్రీకొడుకు బలి

- మిట్టమీదిపల్లి సమీపంలో బైకును ఢీకొట్టిన కారు
- అక్కడికక్కడే మృతి చెందిన తండ్రి, కుమారుడు





మృతి చెందిన సొరకాయల బుజ్జి, ఫణీంద్ర

మార్కాపురం రూరల్: అతి వేగానికి రెండు నిండు ప్రాణాలు బలయ్యాయి. ఎదురుగా వస్తున్న బైకును మితిమీరిన వేగంతో వెళ్తున్న కారు ఢీకొట్టడంతో తండ్రీకుమారులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషాద ఘటన మార్కాపురం మండలంలోని మిట్టమీదిపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ కథనం మేరకు.. కంభం పట్టణంలోని లాల్‌బహదూర్‌శాస్త్రినగర్‌కు చెందిన సొరకాయల బుజ్జి(38) అతని పెద్ద కుమారుడు సొరకాయల ఫణీంద్ర(10) బైక్‌పై పల్నాడు జిల్లా మాచర్ల మండలం వెల్దుర్తికి వెళ్లి వస్తున్నారు. ఫణీంద్రకు ఆయాసం ఉండటంతో బుధవారం ఉదయం కంభం నుంచి వెల్దుర్తి వెళ్లి వైద్యం చేయించుకుని తిరుగు ప్రయాణంలో ఉన్నారు. మరో 20 నిమిషాల్లో ఇంటికి చేరుకోవాల్సిన తండ్రీ కుమారులను కారు రూపంలో మృత్యువు బలి తీసుకుంది. కంభం వైపు నుంచి మార్కాపురం దిశగా అతివేగంగా వస్తున్న కారు మిట్టమీదిపల్లి గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో తండ్రీకొడుకులు తీవ్ర గాయాలతో సంఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచారు. భర్త, కుమారుడు మృతి చెందినట్లు తెలుసుకున్న భార్య రమాదేవి, చిన్నకుమారుడు మహేశ్, బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. ఇక మాకు దిక్కెవరంటూ వారు రోధిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది. బుజ్జి కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఫణీంద్ర కంభం పట్టణంలోని వాసవీ విద్యానికేతన్‌లో 5వ తరగతి చదువుతున్నాడు. కారులో ప్రయాణిస్తున్న ఇరువురికి స్వల్ప గాయాలవడంతో గుంటూరు తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మార్కాపురం రూరల్ ఎస్సై తెలిపారు.

బాలికలతో అసభ్యంగా ప్రవర్తిస్తే సహించం

- బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి
- మద్దిపాడు మండలంలో ఉపాధ్యాయుడి సస్పెన్షన్‌కు ఆదేశాలు



విద్యార్థినుల తల్లిదండ్రులను విచారిస్తున్న బత్తుల పద్మావతి, డీవైఈఓ అజిత, ఇతర అధికారులు

మద్దిపాడు: బాలికలతో అసభ్యంగా ప్రవర్తిస్తూ ఉపాధ్యాయ వృత్తికి కళంకం తీసుకొచ్చేవారిని ఉపేక్షించేది లేదని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి హెచ్చరించారు. బుధవారం మద్దిపాడు మండలంలోని తెల్లబాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు ప్రసాద్ వ్యవహార శైలిపై డీవైఈఓ అజిత చేపట్టిన విచారణకు ఆమె హాజరయ్యారు. ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థినుల తల్లిదండ్రులను సుదీర్ఘంగా ఆరు గంటలపాటు విచారించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ.. బాలికలను కొందరు ఉపాధ్యాయులు వేధిస్తున్నారన్న విషయాన్ని తెలుసుకుని కమిషన్ సుమోటోగా తీసుకుని విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. బాలబాలికలకు, తల్లిదండ్రులకు కమిషన్ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. పాఠశాలలో విద్యార్థినులను వేధిస్తున్న ఉపాధ్యాయులను సస్పెండ్ చేయాలని డీఈఓకు ఆదేశాలు జారీ చేస్తున్నట్లు తెలిపారు. డైనింగ్ రూమ్ అపరిశుభ్రంగా ఉండడం, విద్యార్థులు ఇళ్ల నుంచి క్యారేజీలు తీసుకురావడాన్ని చూసి ఏం చేస్తున్నారంటూ ప్రధానోపాధ్యాయుడిని ప్రశ్నించారు. ఉపాధ్యాయినులు, విద్యార్థినులు వినియోగించే టాయిలెట్స్ అపరిశుభ్రంగా ఉండటంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్లు ఇవ్వకపోవడాన్ని ప్రధానోపాధ్యాయుడి నిర్లక్ష్యంగా భావించి చర్యలు తీసుకోవాలని ఎంఈఓ ఎంవీఆర్ ఆంజనేయులును ఆదేశించారు. ఈ క్రమంలో 8, 9, 10వ తరగతి విద్యార్థినులు పలువురు తమను అశ్లీల పదజాలంతో ఒకరు వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారు. వారు పాఠశాలలో ఉంటే తమ పిల్లలను చదువు మాన్పిస్తామని బాలికల తల్లిదండ్రులు విచారణాధికారుల ఎదుట కుండబద్దలు కొట్టారు. పాఠశాలలో క్రమశిక్షణా రాహిత్యం ఎక్కువ కావడానికి కారకులెవరని ప్రశ్నించారు. దీనిపై కమిషన్ సభ్యురాలు పద్మావతి స్పందిస్తూ.. క్రమశిక్షణా రాహిత్యంపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని, ఆ మేరకు డీఈఓకు ఆదేశాలు జారీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా బాలల వెల్ఫేర్ కమిటీ మెంబర్ ఓ.నీలిమ, డీసీపీఓ దినేష్, జీఎంఎస్‌కే అర్షియా, అంగన్‌వాడీ సూపర్వైజర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

కంది పంటకు ప్రభుత్వ మద్దతు ధర

- క్వింటాకు రూ.7 వేల నుంచి రూ.7500
- జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు వెల్లడి



తలమళ్లలో కంది పంటను పరిశీలిస్తున్న జేడీఏ శ్రీనివాసరావు, అధికారులు

పొదిలి రూరల్: రైతులు పండించిన కంది పంటకు ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటించిందని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం పొదిలి మండలం తలమళ్ల గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో ఏలూరు, తలమళ్ల, ఉప్పలపాడు, అన్నవరం గ్రామాల రైతులతో కందుల కొనుగోలుపై ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీఏ మాట్లాడుతూ.. పొదిలి మండలంలో 8 వేల హెక్టార్లలో కంది సాగు చేశారని, 5 నుంచి 6 వేల టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నామన్నారు. ప్రభుత్వం ఇప్పటికే క్వింటాకు రూ.7 వేల మద్దతు ధర ప్రకటించిందన్నారు. అదనంగా మరో రూ..500 ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. గోనె సంచులు, హమాలి చార్జీలు, రవాణా ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందన్నారు. క్వింటాకు కనీస మద్దతు ధర రూ.10 వేలు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేయగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని జేడీఏ చెప్పారు. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ గ్లోరియా, ఏఓ ఎస్కే జైనులాబ్దిన్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.